
# సినీ బేతాళ కథలు





- డా. కె.వివేకానందమూర్తి

*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 9 -

## ధర్మరాజు మళ్ళీ పుట్టాడు

**విక్రమార్కుడు,** బేతాళుడి శవాన్ని మళ్ళీ తన భుజం మీద వేసుకుని నడకసాగించాడు.

'విక్రమార్కా! నీకు శ్రమ కలుగకుండా ఉండేందుకు మళ్ళీ మరో కథ చెబుతాను, విను -' అని బేతాళుడు ప్రారంభించాడు.

- అనగనగా అతలాకుతలం అనే దర్శకుడు ఉండేవాడు. అతను ఎన్నో చిత్రాలు తీసి వేలాది ప్రేక్షకుల మనసుల్ని కకలావికలం చేసిన అనుభవశాలి. తను తీయబోయే కొత్త చిత్రానికి ఏ సబ్జక్టు అయితే బాగుంటుందా అని డిస్కస్ చెయ్యడానికి, తన చిత్రాలకు రెగ్యులర్‌గా రాసే రైటర్, పంచ్‌శ్రీని పిలిచాడు. పంచ్‌శ్రీ ఎర్రటి లుంగీ పంచె కట్టుకుని, తెల్లటికాగితం పట్టుకుని వచ్చాడు. ఇద్దరూ కూచున్నారు.

'ఈసారి మన ఇతిహాసాల్లో మాంచి క్యారెక్టర్ బేస్డ్ సబ్జెక్టు ట్రై చేద్దామనిపిస్తోంది. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, రావణుడు, దుర్యోధనుడు, సీత, సత్యభామ - ఇలా ఆల్‌రెడీ టచ్ చేసినవి కాకుండా ఏవన్నా కాస్త డిఫెరెంట్‌గా సూచించగలవా!' అని పంచ్‌శ్రీని అడిగాడు దర్శకుడు అతలాకుతలం.

'ముందు నాకు తట్టే కొన్ని పేర్లు రాసి చూపిస్తాను-' అని పంచ్‌శ్రీ రాయడం మొదలు పెట్టాడు. రాస్తుంటే పంచ్‌శ్రీ చేతివేళ్ళు విపరీతంగా వణకడం చూసి, అతలాకుతలం అడిగాడు.

'ఏవయ్యా పంచీ! ఏవిటి నీ వేళ్ళు అలావణుకుతున్నాయి. ముందు బాగా కొడుతున్నావా?' - అని.

'ఏం కొట్టడం సార్? ఈ వణుక్కి సగం మందు కిందే ఒలికి పోతోంది. ఒక చెంచాడు గొంతుకలో చేరితే ఏదో అవార్డు దక్కినట్టుంటోంది' అంటూ కొన్నిపేర్లు రాశాడు పంచ్‌శ్రీ

'సర్లే రాసిన పేర్లు చాలుగానీ - నాకవన్నీ చదివే ఓపిక లేదు. నీకు నచ్చిన ఒక్క పాత్ర పేరొకటి చెప్పు చాలు.'

'ధర్మరాజు సార్'

'ధర్మరాజా? ఇప్పటికే యముడి మీద చాలా తీశారు. '

'యమధర్మరాజు కాదుసార్! జస్ట్ ధర్మరాజు. పాండవుల్లో యెల్డెస్టు.'

'ఆ ధర్మరాజా ..! ధర్మరాజుతో అంత విషయం ఉన్న సినిమా ఏం తీస్తావయ్యా?'

'తీస్తావండీ. తియ్యగలం. ధర్మరాజు గురించి మీరు కాస్త డీటైల్డ్‌గా వింటే, మీరే కత్తులూ, రంపాలూ, ఐటంసాంగ్స్ అన్నీ మరచిపోతారు.'

'అలాగే - అయితే కాస్త అవుట్ లైన్ చెప్పు'

'నేను ఆల్‌రెడీ ఆ మధ్య ధర్మరాజు గురించి కొంత వర్కవుట్ చేశాను. యక్షప్రశ్నలు - వాటికి ధర్మరాజు సమాధానలు మీకు తెలిసే ఉంటుంది.'

'అవును. ఎప్పుడో భారతంలో చదివాను. ఇపుడు నువ్వు నన్ను చెప్పమంటే అది నాకో యక్షప్రశ్న. నువ్వే మళ్ళా వివరంగా రిపీట్ చేసి చెప్పు' అనడిగాడు అతలాకుతలం.

పంచ్‌శ్రీ ప్రారంభించాడు.

'పాండవులు అరణ్యవాసం చేసేటప్పుడు అక్కడ చెట్లూ, చేమలూ, లేడిపిల్లలు, సెలయేళ్ళు వగైరాలన్నీ చూసి - ఈలొకేషన్ అవుట్‌డోర్‌కి అన్ని విధాలా బావుంది. ఏవైనా కొన్ని పైలట్ షాట్స్ తీసుకుందామనుకున్నారు. అర్జునుడు కూడా తెచ్చుకున్న కెమెరా ఒక చెట్టు కొమ్మకి తగిలించుకున్నాడు. కెమెరా కోసం కొమ్మవేపు చూస్తే సరిగ్గా అదే టైముకు ఒక కొంగ అంటే బకం ఆ కెమెరా తన ముక్కుకి తగిలించుకుని ఎగిరిపోసాగింది. పాండవులు అయిదుగురూ ఆ కొంగ ఎగిరే రూట్లో అడవిలో పరుగెత్తసాగారు.'

'ఆ టైములో కెమెరాలుండేవా?'

'ఉండేవా అంటే ఉండేవి.. మనం ఉండేవి అని చూపిస్తే ఉన్నట్టే. మనదంతా అతలాకుతలం కదా!'

'కానీ మరి.'

- 'సరే అలా ఎంతో దూరం పరిగెత్తాక పాండవులు అలసిపోయారు. దాహంతో గొంతులు ఎండిపోయాయి.

- కనీసం ఒక్క నీటి చుక్క కూడా దొరకలేదు. అలాగే కాళ్ళీడ్చుకుంటూ నడుస్తున్నారు. అలా నడవగా, నడవగా, శ్రీకృష్ణ పరమాత్మను తలుచుకోగా చివరికి వారికో కొలను కనిపించి ప్రాణం లేచొచ్చినట్టయింది.

ఆ కొలను నిర్మలంగా ఉంది. కొలను వారగా కెమెరా ఎగరేసుకుపోయిన బకం ఉంది. కానీ బకం ముక్కున కెమెరా వేళ్ళాడ్డంలేదు. పాండవులు కెమెరా గురించి ఆలోచించే స్థితిలో లేరు. దాహార్తులై ఉన్నారు. ముందుగా నకుల సహదేవులు కొలనులో నీరు తాగి దప్పిక తీర్చుకోవడానికి ఒడ్డు దగ్గర వంగారు. వెంటనే బకం వారిని వారించింది. - మీరు ఈ కొలనులో నీరు తాగే ముందు, నేను అడగబోయే ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పాలి. నా ప్రశ్నలు వినకుండా నా కొలను నీరు తాగితే తక్షణం మరణిస్తారు -'

'భాష నేర్చిన పక్షివా? చూడు మేం బాగా దాహంతో ఉన్నాం. ముందుగా మేం నీళ్ళు తాగగానే నీ సంగతి ఆలోచిస్తాం' అన్నారు నకుల సహదేవులు.

'వద్దు. ప్రాణాలు పోగొట్టుకోవద్దు ' బకం మళ్ళీ వారించింది.

'ఓ పక్షీ! భాష నేర్చిన అక్షర కుక్షీ! నోరుమూసుకో, అదే ముక్కు మూసుకో' అని నకుల సహదేవులు కొలను నీరు తాగారు.

బకం బకబకా నవ్వింది. కనిష్ట సోదరులిద్దరూ నేలకూలారు. వారి వెనుకే భీమార్జునులు కూడా పక్షిని లక్ష్యం చెయ్యకుండా నీరు తాగారు. వారూ వెంటనే మరణించారు. కానీ ధర్మరాజు గ్రహించాడు. తన కంటి ముందే తన నలుగురు సోదరులూ ప్రాణాలు కోల్పోవడం చూసి బాధాతప్తుడయ్యాడు. బకంతో అన్నాడు.

'నువ్వు బకానివి కాదు. ఎవరో యక్షుడివి.

నీ ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి నేను సిద్ధం' అన్నాడు.

అప్పుడు బక రూపుడైన యక్షుడు -

'నీ ధర్మ పరాయణకు, మేధాచతురతకి ఆనందం కలుగుతోంది. నీవు స్థిత ప్రజ్ఞుడివలెనున్నావు' - నా మొదటి ప్రశ్న -

సినిమా సక్సెస్‌కి కారుకుడెవడు? - నిర్మాతలా, దర్శకులా? టెక్నీషియన్లా? నటులా?

ధర్మరాజు: వీరెవరూకాదు. ప్రేక్షకులు.

బకుడు - నిర్మాత అనగా ఎవరు?

ధర్మరాజు - సినీకళామతల్లి అనే మాతను కోల్పోయినవాడు - నిర్‌మాత - నిర్మాత.

బకుడు - ఏది ఉత్తమ చిత్రం? ఏది తమ చిత్రం?

ధర్మరాజు - అందరూ చూసి ఆనందించేది ఉత్తమచిత్రం. నిర్మాత, దర్శకుడు అండ్ ఫామిలీ మాత్రమే, చూసుకోడానికి మిగిలేది ఉత్తమచిత్రం.

బకుడు:- అన్నింటికంటే వేగమైనది ఏది?

ధర్మరాజు - రిలీజయిన రోజు, మొదటి ఆట ఇంటర్వెల్ దాకా మాత్రమే ఆడివెళ్ళిపోయే కొత్తసినిమా.

బకుడు - రోజూ ఆడే క్రీడాకారుడెవరు?

ధర్మరాజు - సినిమా థియేటర్ - విరామం లేకుండా రోజూ ఏదో ఒక ఆట ఆడుతూనే ఉండును.

బకుడు: - ఎవరు ఉత్తమనటుడు?

ధర్మరాజు: - తెరమీదే కాకుండా, తెరవెనుక కూడా నలుగురితో నటన తెలిసినవాడు.

బకుడు:- ఎవరు ఉత్తమ నటి?

ధర్మరాజు - ఐటమ్ సాంగ్ డాన్సర్స్ పొట్టకొట్టినది.

బకుడు:- నిర్మాత దృష్టిలో ఎవరు పాపులర్ హీరోయిన్?

ధర్మరాజు: - చేతులతో కాకుండా కాళ్ళతో నిర్మాత వెన్నుకి దణ్ణం పెట్టే హీరోయిన్.

బకుడు: - అద్భుతహ ధర్మజా! నీ జ్ఞానసంపదకు మెచ్చాను. నువ్విప్పుడు హేపీగా కొలనులో నీరు త్రాగు. నీకు ప్రాణ హానిలేదు. అంతే కాదు ప్రాణాల్ని కోల్పోయిన నీ నలుగురి సోదరులతో ఒక్క సోదరుడికి మాత్రం ప్రాణదానం చేస్తాను. ఎవర్ని బ్రతికించమంటావో చెప్పు?

ధర్మరాజు : - నకులుడినో , సహదేవుడినో బ్రతికించు.

బకుడు - అదేమి ధర్మజా! అతి పరాక్రమవంతులైన భీమార్జునులలో ఒకరిని కాక, వారిని కాదని నకులుడో, సహదేవుడో అని ఏల అర్థించితివి?

ధర్మరాజు - 'నేను, భీమార్జునులు మా తల్లి కుంతీపుత్రులం. నకుల సహదేవులు మా మరో తల్లి మాద్రీ సుతులు. ఒక తల్లికి పిల్లలు సజీవులై ఉండి, మరో తల్లికి ఒక తనయుడేనా లేకపోవడం ధర్మంకాదు. '

బకుడు – 'భళా! ధర్మజా! నీ ధర్మ నిరతికి నా నీరాజనం. నీ సోదరులందరకు ప్రాణదానం చేస్తున్నాను. మీ పాండవులైదుగురూ సజీవులై సంగ్రామ విజయం సాధించండి.' అని దీవించి బకరూపంలో పుత్రుడిని పరీక్షించిన ధర్మజుని తండ్రి యమధర్మరాజు ఆనందంతో అంతర్ధానమయ్యాడు – – అని పంచ్ శ్రీ దర్శకుడు అతలాకుతలానికి కథ, చాలావరకూ డైలాగ్స్ తో సహా విశదీకరించాడు.

'చాలా మంచి సబ్జక్టు సెలెక్ట్ చేశావు కవిశ్రీ అయితే సినిమాకి పేరేం పెడదాం?'

'ధర్మరాజు' – వేరే పేరెందుకూ?' – పంచ్ శ్రీ

'నో. నువ్వు చెప్పిన కథ ఒక ఇన్స్పిరేషన్.

మనం తీసే కథ – ఒక సెన్సేషన్.

దానిపేరు – 'ధర్మరాజు మళ్ళీ పుట్టాడు' – అన్నాడు అతలాకుతలం.

– ఇప్పుడు చెప్పు విక్రమార్కా! అతలాకుతలం మనసులో ఉన్న ఆ సెన్సేషన్ ఏవిటి? కొత్త సినిమాకి 'ధర్మరాజు మళ్ళీ పుట్టాడు' అనే టైటిల్ పెట్టడంలో అంతరార్థవేవిటి? ఈ ప్రశ్నలకు నువ్వు తెలిసే సమాధానం చెప్పకపోయావో నీ తలవెయ్యి చెక్కలయి, విక్రమార్కుడు మళ్ళీ పుట్టే కొశ్చనే ఉండదు' – అని బేతాళుడు ముగించాడు.

బదులుగా విక్రమార్కుడు సమాధానం చెప్పాడు. – 'ఓ బేతాళా! ధర్మజుడి కథ వినగానే అతలాకుతలానికి, జాన్ సింప్సన్ స్ఫురించాడు. జాన్ సింప్సన్ గత ముప్పై ఐదేళ్ళుగా జర్నలిజంలో ఊడలు దించుకుంటూ విస్తరిస్తున్న మహా వటవృక్షం. బి.బి.సి. పొలిటికల్ న్యూస్ ఎడిటర్. నూట ఇరవైదేశాల సమృద్ధినీ, సంక్షోభాన్నీ సమస్త ప్రజకీ నివేదించిన బి.బి.సి వరల్డ్ ఎఫైర్స్ ఎడిటర్. నిజం కథల్ని నిక్కచ్చిగా నిర్భయంగా చెప్పేందుకు అడ్డం వస్తే చావుని కూడా చచ్చిపోమంటాను – అన్న మనీషి.

జాన్ సింప్సన్‌కి అప్పుడు ఏడేళ్ళ వయసు. అతడి అమ్మా, నాన్నా విడిపోయారు. ఇంగ్లండ్‌లో తల్లిదండ్రులు విడిపోయినప్పుడు, పిల్లల్ని తల్లి తీసుకువెళ్ళడం సాధారణంగా జరిగేది. అమ్మా, నాన్నా ఎవరి మూటాముల్లె వారు సర్దుకున్నారు. 'రారా – పోదాం' అని జాన్ సింప్సన్‌ని వాళ్ళమ్మ పిలిచింది' వాడికి ఎవరితో ఉండాలని ఉందో వాణ్ణి అడగక్కరలేదా?' అనడిగాడు తండ్రి.

జాన్ తల్లికి, తన తండ్రితో పెళ్ళికి ముందే వేరే భర్తతో సంతానం ఉంది. ఏడేళ్ళ జాన్ సింప్సన్ అప్పుడు తల్లికి చెప్పాడు.

'అమ్మా – నిన్ను చూసుకోడానికి అక్కయ్య ఉంది. నాన్నకెవరూ లేదు. నేను నీతో రాను. నాన్నకి సాయంగా నాన్నతో వెళ్ళిపోతాను. ఇదే ధర్మం.' అని నాన్నతో నడిచి తండ్రి సేవకు అంకితమయ్యాడు. అప్పటి ధర్మరాజుకి ఏడేళ్ళ జాన్ సింప్సన్ ఏవీ తీసిపోడు.

దర్శకుడు అతలాకుతలానికి ధర్మరాజు ఇన్స్పిరేషన్ – జాన్ సింప్సన్ సెన్సేషన్.

నేను సైతం జర్నలిస్టుకి చిత్రమొక్కటి హారతిస్తా! – అన్నాడు దర్శకుడు.

సమతాభావానికి సరైన నిర్వచనం –

'ఆత్మౌ పంయేన సర్వత్ర సమం పశ్యతి యో అర్జున!

సుఖం వాయది నా దుఃఖం స యోగీ పరమోమతః!!'

– అన్నాడోయ్ గీతాచార్యులు శ్రీకృష్ణభగవానుడు –' అని విక్రమార్కుడు ముగించగానే, రాజుకి మౌనభంగం కలిగి బేతాళుడు మళ్ళీ చెట్టెక్కి ఆకుచాటు పిందైపోయాడు.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments